క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం లో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. విజయవాడకు చెందిన ఎంవీఎస్ఎస్ఆర్ చంద్రిక బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన కూచిపూడి నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

ఫైర్ స్టేషన్ తనిఖీ



ఆటోనగర్ (విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని అగ్ని మాపక కేంద్రాన్ని రీజనల్ ఆఫీసర్ ఈ. స్వామి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పరికరాలను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కృష్ణాజిల్లా కంకిపాడులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో గతం కన్నా 20 శాతం ప్రమాదాలు తగ్గాయన్నారు. ఈ ఆరు నెలల కాలంలో 1356 ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు. రూ.13.58 కోట్లు ఆస్తిని కాపాడినట్టు చెప్పారు. నష్టం రూ.6.6 కోట్లు అని ఆయన చెప్పారు. ఏలూరు, కంకిపాడు, రాజమండ్రితోపాటు భీమవరంలో ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రాన్ని రూ. 5కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం సిబ్బందికి బూట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి నరేష్, సిబ్బంది ఉన్నారు.

పాతశివాలయం పాలకవర్గానికి దరఖాస్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) నూతన పాలకవర్గం నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. నాగరాజు తెలిపారు. ఈ నెల రెండో తేదీన దేవదాయ ధర్మదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ కార్యాలయం ఈ పాలకవర్గ నియామకానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశారని పేర్కొన్నారు. నోటిఫికేషన్ తేదీ నుంచి 20 రోజుల లోపు ఆసక్తి కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ నిర్ధేశించిన అర్హతలు కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రూ.4.8లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో రూ.4.8 లక్షలతో నిర్మించతల పెట్టిన అంతర్గత రోడ్డును శుక్రవారం స్థానిక కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో ఇప్పటికే డివిజన్‌లో రోడ్డు పనులు కోట్లాది రూపాయల వ్యయంతో పూర్తిచేశామన్నారు. ఇక్కడ పాడైన రోడ్డును రూ.4.8లక్షల వ్యయంతో వేస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

పవన్‌కు ప్రజా సమస్యలపై అవగాహన లేదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ అన్నారు. ముత్యాలంపాడులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌కు సీఎంను విమర్శించే అర్హత, స్థాయి లేదన్నారు. పవన్ ప్రజా సమస్యలపై ఎటువంటి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, సినిమాలో చెప్పిన డైలాగులు చెప్తే చప్పట్లు తప్ప ఓట్లు పడవని అన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళాశాలకని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ ఇంటర్మీడియెట్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన న్యూరాజరాజేశ్వరీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం 57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేట ప్రాంతానికి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ కూలిపనులు చేసుకుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నారు. గాంధీజీ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న తమ చిన్నకూతురు(15) ఈ నెల 8వ తేదీన కళాశాలకని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. చీకటిపడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన వారు చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినప్పటికి ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందం ఆహ్లాదం ఆరోగ్యం



సత్యనారాయణపురంలోని ఆంధ్రరత్న పార్కు

తుది దశకు ఆంధ్రరత్న పార్కు అభివృద్ధి పనులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్రరత్న పార్కులో అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 2005లో నగరపాలకసంస్థ ఈ పార్కును ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ పార్కులో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకోవడంతో పాటు మహిళలు తమ పిల్లలతో సరదాగా గడిపేందుకు వస్తుంటారు. అయితే గత పాలకులు పార్కు నిర్వహణ బాధ్యతలను పట్టించుకోకపోవడంతో.. ఎంతో ఆదరణ ఉన్న ఈ పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల ఆటపరికరాలు విరిగిపోయి, ఎండిపోయిన మొక్కలతో శిథిలావస్థ దశకు చేరుకుంది. తెలుగుదేశం పార్టీలో ఉన్న అప్పటి ఎమ్మెల్యే, కార్పొరేటర్ సైతం పార్కు అభివృద్ధి వైపు దృష్టిపెట్టకపోవడంతో పార్కును సందర్శించే వారి సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపోయింది.

రూ. 14 లక్షలతో పనులు..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు నగరం నడిబొడ్డున ఉన్న సత్యనారాయణపురం అభివృద్ధికి పెద్ద పీట వేశారు. డివిజన్ పర్యటనలో భాగంగా స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు పార్కు అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టారు. అందుకోసం రూ. 14లక్షలు నిధులు మంజూరు చేయడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి ప్రతి రోజు పనులను పర్యవేక్షిస్తూ త్వరతగతిన పూర్తి చేసి సందర్శకులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నారు.


యువకుల కోసం ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు


పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్

పార్కులో మౌలిక సదుపాయాల కల్పన..

ఆంధ్రరత్న పార్కులో విశాలమైన వాకింగ్ ట్రాక్ నిర్మాణం, కుటుంబ సభ్యులతో చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరేలా పచ్చదనం, పిల్లల కోసం ఆటపరికరాలు, యువకుల కోసం జిమ్, టెన్నిస్ కోర్టు, వృద్ధుల కోసం ఎఫ్ఎం రేడియో, పార్కు గోడలకు అందమైన రంగులు, విద్యుత్ వెలుగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని ఈ నెలాఖరుకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి తెలిపారు.

ముమ్మరంగా రహదారుల నిర్మాణాలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు
- సత్యనారాయణపురంలో రూ. 60లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


వందనంవారివీధిలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సెంట్రల్ నియోజకవర్గంలో ముమ్మరంగా రహదారుల పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. స్థానిక 33వ డివిజన్ సత్యనారాయణపురంలో రూ. 60 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి శుక్రవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. గత తెలుగుదేశం హయాంలో డివిజన్‌లో రోడ్లు కనీసం తట్టెడు మట్టికి కూడా నోచుకోలేదని మల్లాది విష్ణు విమర్శించారు. కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు అన్ని స్థాయిలలోనూ తెలుగుదేశం ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సత్యనారాయణపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన తెలిపారు. నాలుగేళ్లలో రూ. కోటి 36 లక్షల నిధులతో డివిజన్‌లో 1.36 కి.మీ. మేర రహదారుల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. గడప గడపకి మన ప్రభుత్వంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోవడాన్ని గుర్తించామని మల్లాది విష్ణు పేర్కొన్నారు. నూతన రహదారుల నిర్మాణంతో ఈ ప్రాంత ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఇప్పటివరకు 11 వీధులలో రోడ్ల నిర్మాణాలను పూర్తిచేసుకోగా, వ్యాకరణం వారి వీధి, రామమందిరం వీధి, వందనపువారి వీధులలో రహదారుల పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు.

మరిన్ని అభివృద్ధి పనులు..

ఏకేటీపీ స్కూల్లో రూ. 2.56 కోట్ల నిధులతో చేపట్టిన నాడు–నేడు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఆంధ్రరత్న పార్కును సైతం రూ. 14 లక్షల నిధులతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. 90 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి ఈ ప్రభుత్వంలోనే రూ. 70 లక్షల కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులు విడుదలైనట్లు మల్లాది విష్ణు గుర్తు చేశారు. అలాగే అమ్మవారి ఆశీస్సులతో ఈ ప్రాంతంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు శనగవరపు శ్రీనివాస్, లంకా బాబు, కమ్మిలి రత్న, ఉప్పు రంగబాబు, మైలవరపు రాము, నాళం బంగారి, కొల్లూరు రామకృష్ణ, టి.గోపాలకృష్ణ, కొప్పరపు మారుతి, చల్లాప్రగడ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఇంటింటా ఆనందమే సీఎం జగన్ లక్ష్యం

- ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు
- 60వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం


స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరిసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని 264, 265వ వార్డ్ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన 408 గడపలను సందర్శించారు. స్థానిక ప్రజల సమస్యలను ఆయన ప్రత్యక్షంగా వీక్షించి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు.

మహిళలందరిని తోబుట్టువుల్లా..

రాష్ట్రంలో ఉన్న మహిళలందరినీ తన తోబుట్టువుల్లా చూసుకుంటూ, వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహన్ని అందిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి మన జగనన్న అని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. వాంబేకాలనీలోని డ్వాక్రా అక్కచెల్లెమ్మలతో ఆయన కాసేపు ముచ్చటించారు. మహిళలంటే సీఎం జగనన్నకు అధిక గౌరవమని, మహిళలు ఆర్థిక ప్రగతిని సాధిస్తే ఆమెతో పాటు ఆ కుటుంబం అంతా అభివృద్ధి చెందుతుందని విశ్వసించిన ఆయన ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేర్లమీదే అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళా లోకమంతా సీఎం జగనన్నకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ సీడీఓ జగదీశ్వరీ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, వార్డ్ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగర శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు సైతం అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషిచేస్తోందని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో జరుగుతున్న నూతన రహదారుల నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రధానంగా నందమూరినగర్, భారతమాత మందిరం రోడ్డు, ఆంధ్రప్రభకాలనీ, తోటవారి వీధి, ఇందిరానాయక్‌నగర్, సన్‌సిటీ కాలనీ ప్రాంతాల్లో రహదారులు సరిగా లేక స్థానిక ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనేక సమస్యలను ఎదుర్కొనేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలను చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మిగిలిన రోడ్లలో కూడా యుద్ధప్రాతిపదికన రహదారుల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్స్‌తో ఆరోగ్యకర జీవితం

ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ శేఖర్‌బాబు


మిల్లెట్స్‌తో వంటకాలను ప్రారంభిస్తున్న డాక్టర్ శేఖర్‌బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పూర్వీకులు మిల్లెట్స్ ఆహారాన్ని తీసుకుని ఎంతో ఆరోగ్యంగా ఉండేవారని, మిల్లెట్స్‌పై ఆధారపడేవారి జీవిత కాలం పెరుగుతుందని ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ/వీసీ డాక్టర్ శేఖర్‌బాబు గెడ్డం పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్ మహిళా విభాగం మూడు బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం 'మిల్లెట్స్‌తో మగువలు' పేరుతో నిర్వహించిన మిల్లెట్స్ కుకింగ్ కాంపిటీషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. మిల్లెట్స్‌ను పండించే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తుందని చెప్పారు. త్వరలోనే 'మిల్లెట్స్‌తో మగవారు' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీవీపీ అమరావతి ప్రాంత ప్రెసిడెంట్ షా రూప్‌చంద్ జైన్, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ మిత్తింటి శారద, ఆంధ్రహాస్పటల్ న్యూట్రిషన్/డైటీషియన్ డాక్టర్ జీ స్వరూప పాల్గొన్నారు. ఈ పోటీలో సమత, శ్వేత భన్సాలీ, కొల్లా కార్తీక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. భరణి మహాలక్ష్మి, కె ధనలక్ష్మి కన్సొలేషన్ బహుమతులు పొందారు.

17 నుంచి శ్రావణ మాసోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 17వ తేదీ నుంచి శ్రావణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణ ప్రసాద్ శర్మ, కాశీ విశ్వనాథ శర్మ పేర్కొన్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు అమ్మవారికి కుంకుమ పూజ, లక్ష్మీ గణపతి హోమం, చండీహోమాలను నిర్వహిస్తామన్నారు. 31వ తేదీ గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారికి 108 కలశాల పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారని చెప్పారు. 8వ తేదీ సామూహిక లక్ష కుంకుమార్చన, చండీ, లక్ష్మీ గణపతి హక్షమం అనంతరం పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని వివరించారు.

భర్త వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కట్టుకున్న భర్త నిత్యం మద్యం తాగి వేదిస్తున్నాడంటూ శుక్రవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదలకు చెందిన జ్యోతిర్మయికి గణేష్‌తో 16 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు ఆగిరిపల్లి మండలం గొల్లగూడెంలో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన గణేష్ నిత్యం మద్యం సేవించి వేధిస్తుండటంతో శుక్రవారం జ్యోతిర్మయి గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారంతో అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆకలితో ఉన్న వారి కడుపు నింపటానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందజేయాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి. వసంతకుమార్ అన్నారు. స్థానిక దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం దాతల సహకారంతో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము దాతలు, సొసైటీ సభ్యుల సహకారంతో అన్నదానం చేస్తున్నామన్నారు. అనంతరం నిరుపేదలు, మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు కె రాము తదితరులు పాల్గొన్నారు.

● స్వరాజ్యంలో స్వరూపం


రాష్ట్రానికే తలమానికంగా నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం పనులు మహాయజ్ఞంలా సాగుతున్నాయి. దీనిలో భాగంగా ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పనులు తుది దశకు చేరాయి. ఇప్పటికే విగ్రహం ముఖం వరకూ పనులు పూర్తయ్యాయి. ఇక చివరి ఫినిషింగ్ పనులు కొనసాగుతున్నాయి. కాగా విగ్రహం కింద ప్రాంగణంలో కూడా చేపట్టాల్సిన పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేషనల్ క్రిస్టియన్ బోర్డు నగర కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నేషనల్ క్రిస్టియన్ బోర్డు విజయవాడ నగర నూతన కమిటీ ఎన్నికైంది. స్థానిక రాణిగారితోటలోని యూసీసీఐ చర్చ్‌లో శుక్రవారం జరిగిన నేషనల్ క్రిస్టియన్ బోర్డు స్టేట్ నాయకుల సమావేశంలో సిటీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిటీ ప్రెసిడెంట్‌గా బి.సుందర్‌పాల్, వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.మోషే, సెక్రటరీగా వి.డానియల్, జాయింట్ సెక్రటరీగా జి.ఆనందరావు, ట్రెజరర్‌గా వి.విజయప్రసాద్, పీఆర్‌వోగా వై.ప్రభుదాస్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ క్రైస్తవులందరూ ఒకటిగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ వై.అశోక్, ఏపీ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ అమర్లపూడి శేఖర్, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ కౌన్సిల్ స్టేట్ చైర్మన్ ఆర్‌జే రాజు, నేషనల్ క్రిస్టియన్ బోర్డు స్టేట్ నాయకులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు సర్వే సక్రమంగా చేయాలి


ఓటరు జాబితా నమోదును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఓటరు జాబితా తయారీకి బూత్‌లెవల్ అధికారులు (బీఎల్‌వో)పారదర్శకంగా వ్యవహరించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని గుణదల, 3వ డివిజన్ పరిధిలో క్రీస్తురాజుపురం బెత్లహేంనగర్‌లో బీఎల్వో యాప్ ద్వారా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పరిశీలనను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటివి చేసి మొబైల్ యాప్ నందు అప్ లోడ్ చేయాలన్నారు. కుటుంబంలో అందరి ఓట్లు ఒకే చోట ఉండేలా చూడాలన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ బూత్లో తగిన కారణాలను పరిశీలించి ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక బూత్లో 1500 ఓటర్లకు మించి గుర్తిస్తే కొత్త బూతుకు సిఫార్సు చేయాలన్నారు, ఫొటో ఓటర్ గుర్తింపు కార్డులలో మార్పులు చేర్పులు తప్పుఒప్పులు సరిచేయడం ప్రధానంగా నిర్వహించాలన్నారు. బీఎల్‌ఓల ఓటర్ల జాబితా పరిశీలనను ఏఈఆర్వోలు అయిన సంబంధిత మండల తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.


బుడమేరు కాలువ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

ఆటంకాలు లేకుండా ప్రవహిస్తున్న ఏలూరు కాలువ



కాలువల స్వచ్ఛతే లక్ష్యంగా వీఎంసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తుండగా.. ఇంకా కొంతమంది నగరంలోని కాలువల్లో చెత్తను పడేస్తుండటంతో కాలువలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. దీంతో మిషన్ ఫర్ క్లీన్ కెనాల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కాలువల గోడలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మైక్ ద్వారా ప్రచారం, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే కాలువల్లో ఎవరూ చెత్త వేయనీయకుండా వీఎంసీ కార్మికుడిని కాపలాగా పెడుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ


ఏలూరు కాలువ వద్ద ఏర్పాటు చేసిన మైక్, సీసీ కెమెరా